క్లుప్తంగా

ట్యాంకర్లతో నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

కొలిమిగుండ్ల: గ్రామాల్లోని బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో మంచినీటి సమస్య నెలకొంది. ప్రజల దాహార్తి తీర్చేందుకు రామ్‌కో సిమెంట్ కంపెనీ ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు శనివారం తెలిపారు. చింతలాయిపల్లె, కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె, మీర్జాపురం గ్రామాల్లో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రతి రోజు ట్యాంకర్లతో నీటి సరఫరా కల్పిస్తున్నామన్నారు. వేసవి ముగిసే వరకు ట్యాంకర్లతో నీటి సరఫరా అందిస్తామని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన నిర్వాహకులు

ప్యాపిలి: స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. సంస్థ నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ తిరుపాల్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత కారణంగా ప్రజల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నిచ్చెనమెట్ల రాము, నూకల రవి, సురేశ్ బాబు, రామాంజనేయులు, రవీందర్, అశోక్, కన్నయ్య, రవిసింగ్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

డోన్: పట్టణంలోని 22వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ నేత శరత్ మొదటి వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి, పాతబస్టాండ్‌లో అన్నదానం చేశారు. అలాగే రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రైల్వేనాయుడు, రాజు, దర్రి, బాలు, రాణా, రాజేష్ శెట్టి, టిప్పు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన పాయకట్టు లక్ష్మీనారాయణస్వామి కుటుంబ సభ్యులు శనివారం విరాళం ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీపీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులు, వేదపండితులకు రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దాతలను సన్మానించారు.

సబ్‌జైల్ తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: పట్టణంలోని సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి శనివారం తనిఖీ చేశారు. జైలులోని పరిస్థితులపై రిమాండ్ ఖైదీలతో అడిగి తెలుసుకున్నారు. భోజన వసతి, వైద్య సేవలు, రిమాండ్ కేసులపై ఆరా తీశారు. ఆర్థిక స్థోమత లేని వారికి ఉచిత న్యాయ సేవలు అందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని సూచించారు. సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. సబ్ జైల్ సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

డోన్ టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో అగ్నిప్రమాదాలపై డాక్టర్లు, నర్సులు, సెక్యూరిటీ సిబ్బంది, రోగుల సహాయకులకు శనివారం అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రెస్క్యూ టీం అపరేషన్స్‌పై ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అగ్ని ప్రమాదం జరిగితే రోగులను ఎలా కాపాడాలి, బయటకు ఎలా వెళ్లాలి అంశాలను అగ్నిమాపక అధికారి రంగస్వామిగౌడ్ వివరించారు.

వ్యాధుల నియంత్రణే లక్ష్యం

బేతంచెర్ల: వ్యాధులు రాకుండా ఉండాలంటే ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ముద్దవరం గ్రామాన్ని సందర్శించారు. డెంగీ కేసును పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



కోవెలకుంట్ల సమీపంలో వరిగడ్డిని చుడుతున్న బేలర్



పొలంలో చుట్టిన గ్రాసం

పని సులభం..నాణ్యత పదిలం!

మారుతున్న కాలానికనుగుణంగా ఆధునిక వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు శ్రమ తగ్గిస్తూ, కూలీల కొరతను తీరుస్తూ డబ్బులు ఆదా చేస్తున్నాయి.

జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో ఏటా వరి, జొన్న పంటలు విస్తారంగా సాగవుతున్నాయి. పంట చేతికందగానే రైతులు కంబైండ్ హార్వేస్టర్లతో కోత, నూర్పిడి పనులు చేపడుతున్నారు. పైరు నుంచి పంట ఉత్పత్తులు వేరుకాగా పొలంలో గ్రాసం మిగులుతోంది. గతంలో గ్రాసాన్ని కూలీల సాయంతో ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లలో నింపుకుని కల్లాల్లో వాములుగా భద్రపరిచి పశువులకు ఆహారంగా అందించేవారు. గ్రాసాన్ని సులభంగా తరలించేందుకు సైతం యంత్రాలను వినియోగిస్తుండడంతో చకచకా పనులు జరుగుతున్నాయి. బేలర్ అనే యంత్రం పొలంలోని వరిగడ్డి, జొన్నచొప్పను చుట్టలుగా చుడుతుంది. ఆ చుట్టలను ట్రాక్టర్లలో నింపుకుని కల్లాల్లో వాములుగా వేస్తున్నారు. గ్రాసం భద్రపరుచుకునేందుకు యంత్రం అందుబాటులోకి రావడంతో పని సులభంగా మారడమే కాకుండా రైతులకు కూలీల కొరత, డబ్బులు ఆదా అవుతోంది. చుట్టలుగా చుట్టిన పశుగ్రాసాన్ని వాములుగా వేయడం వల్ల వర్షాకాలం తడవకుండా ఉండడంతో పశువులకు నాణ్యమైన గ్రాసం అందుతోంది.



వాములుగా వేసిన వరిగడ్డి

–కోవెలకుంట్ల

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవులు



డోన్: మానవహారంగా నిలబడిన క్రైస్తవులు

బేతంచెర్ల: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పట్టణంలో క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసన్న, ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల మీదుగా ఏసుక్రీస్తు మరణ పునరుద్ధాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాస్టర్ సామేలు, ఆనంద్, మల్లేష్ బాబు, రాజశేఖర్, కుమార్, ప్రభుదాసు పాల్గొన్నారు.

క్రైస్తవుల ర్యాలీ

ప్యాపిలి: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకుని క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సియోను చర్చి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీయోను ప్రార్థనా మందిరం పాస్టర్ సుందర్ కుమార్ ఏసు త్యాగాన్ని, ఈస్టర్ విశిష్టతను వివరించారు.

డోన్ టౌన్: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగ సందర్భంగా పట్టణంలోని పాస్టర్లు, క్రైస్తవులు శనివారం రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కొత్తబస్టాండ్, రైల్వేగేట్లు, గుత్తి రోడ్డు మీదుగా కమ్యూనిటీ గ్రౌండ్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పడి ఏసు క్రీస్తును స్మరించుకున్నారు. రెవరెండ్‌లు శామ్యూల్, ఆనందరావు, పాస్టర్లు తిమోతి, సాగర్, ఉదయ్, నిరీక్షణ, ప్రసాద్, ప్రభు, డేవిడ్ పాల్గొన్నారు.

రేపు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

డోన్ టౌన్: ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేశిరాజు శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టిక్కెట్లను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు అర్ధగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని ఎస్కేపీ హైస్కూల్ వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులతో ఆదివారం పాతబస్టాండ్, రైల్వే స్టేషన్ రోడ్డు, షాదిఖానా, సుందర్‌సింగ్ కాలనీ, డీఎస్పీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బనగానపల్లెలో..

బనగానపల్లె రూరల్: మండలంలోని పాతపాడు, కైప, నందవరం, ఇల్లూరుకొత్తపేట, పలుకూరు, బనగానపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ రూరల్ ఏఈ గర్జప్ప తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుడి అరెస్ట్

సంజామల: బెల్ట్ షాపులో విక్రయాల కోసం అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఆల్వకొండ గ్రామానికి చెందిన ఈడిగ రామచంద్రుడు మద్యం సీసాలను తీసుకెళ్తుండగా ఆల్వకొండ క్రాస్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు.

పనిముట్లు పంపిణీ



లబ్ధిదారులకు పనిముట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

డోన్ టౌన్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారులకు స్థానిక పోస్టాఫీసులో శనివారం ఇన్‌చార్జ్ పోస్టుమాస్టర్ నాగరాజు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో పనిముట్లను పంపిణీ చేశారు. కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ఈ పథకం కింద 18 రకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకున్న వారికి ఉచితంగా రూ.15వేల విలువ చేసే పనిముట్లు అందిస్తారన్నారు. అంతే కాకుండ శిక్షణా కాలంలో రోజుకు రూ.500, బ్యాంక్ ద్వారా 5 శాతం వడ్డీతో రూ.లక్ష వరకు పూచీకత్తు లేకుండా రుణం అందజేస్తారని తెలిపారు. బీజేపీ నాయకులు తిమ్మారెడ్డి, వెంకటేశ్వర్లు, రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రకటనపై జాప్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్

ప్యాపిలి: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్‌నాయక్, జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వేతన సవరణకు సంబంధించిన 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలన్నారు. 20 నెలలు అవుతున్నా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులకు మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు హాజీ మస్తాన్ వలి, నాగమేల్లష్, రవీంద్ర గుప్త పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



డెమో ద్వారా అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బనగానపల్లె రూరల్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని బనగానపల్లె అగ్నిమాపకశాఖ అధికారి ఈశ్వర్‌నాయక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో తగినంత నీరు, కార్బొండయాక్సైడ్–2తో పాటు ఇతర అగ్నిమాపక నివారణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే బాధితులను ఎలా రక్షించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

బనగానపల్లె: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ–వేస్ట్‌ను సేకరించడంతో పాటు ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

● డోన్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆర్డీఓ నరసింహులు అన్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాతపేటలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఈ–వేస్ట్ కలెక్షన్ కేంద్రాన్ని కమిషనర్ ప్రసాద్‌గౌడ్ ప్రారంభించారు. ప్రతి శనివారం పట్టణంలోని అన్ని ఎలక్ట్రానిక్ షాపుల వద్దకు వెళ్లి వ్యర్థాలను సేకరిస్తామని తెలిపారు.

● కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తిలో డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు పనులు చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్ శివారెడ్డి, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, ఎంఈఓ పాల్గొన్నారు.

● సంజామల: మండల పరిధిలోని కమలపురి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చెత్తను శుభ్రం చేశారు. ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ అనిల్ కుమార్ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

● బేతంచెర్ల: పరిసరాల పరిశుభ్రతకు అందరూ సహకరించాలని తహసీల్దార్ ప్రకాశ్ బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వైద్య సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈ–వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు.

మొక్కజొన్న పంట దగ్ధం



ప్యాపిలి: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైంది. గ్రామానికి చెందిన నడిపి బాలుడు తనకున్న రెండు ఎకరాల పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. శనివారం వీచిన ఈదురుగాలులకు పొలం వద్ద ఉన్న విద్యుత్ లైన్ ద్వారా షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో చెలరేగిన మంటలకు చేతికి వచ్చిన మొక్కజొన్న పంట పూర్తిగా కాలిబూడిదైంది. ప్రమాదంలో రూ. 2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం మంజూరు చేయాలని బాధితుడు కోరుతున్నాడు.



దగ్ధమైన మొక్కజొన్న పంట (ఇన్‌సెట్)లో కాలిపోయిన మొక్కజొన్న కంకులు

హోటల్‌లో అగ్ని ప్రమాదం



కాలిపోయిన వస్తువులు

డోన్ టౌన్: స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సమీపంలోని ఓ హోటల్‌లో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. డోన్‌కు చెందిన వెంకటేశులు జాతీయ రహదారి పక్కనే హోటల్ నడుపుతుండేవాడు. అయితే వ్యాపారం సరిగ్గా లేకపోవడంతో ఐదారు నెలల నుంచి మూసి ఉంచాడు. శనివారం ఉదయం హోటల్ నుంచి మంటలు వస్తుండడాన్ని గమనించిన బాధితులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో హోటల్‌లో ఉన్న రెండు ఫ్రిజ్‌లు, ప్లాస్టిక్ కుర్చీలు, టేబుళ్లతో పాటు మరికొంత సామగ్రి కాలిపోయింది. సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయాడు.

ఈ–వేస్ట్ నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వ్యర్థ పదార్థాల (ఈ–వేస్ట్) నిర్వహణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ–వేస్ట్‌ను తొలగించేందుకు ప్రత్యేక పద్ధతి అవలంభించాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర సాంకేతిక సేవా సంస్థల సహకారంతో వీటిని నిర్వీర్యం చేయాలని పేర్కొన్నారు. ఈ– వేస్ట్‌ను సరైన విధానంలో తొలగించకపోతే అనేక పర్యావరణ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఈ–వేస్ట్‌లో అనేక భార లోహాలు ఉంటాయని, వీటిని సరైన పద్ధతిలో వేరు చేస్తే ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, కృష్ణశశాంక, రమణారెడ్డి, లక్ష్మీదేవి, సంటిరెడ్డి, రాజశేఖర్, షహనాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు కరెంట్ కష్టాలు

- పనిచేయని జనరేటర్.. నిలిచిపోయిన సేవలు
- ఖాతాదారులకు తప్పని నిరీక్షణ



కరెంట్ లేక ఉక్కపోతతో బ్యాంకు బయట వేచి ఉన్న ఖాతాదారులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల ట్రాన్స్‌కో కార్యాలయ పరిధిలో మూడో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో బ్యాంకు ఖాతాదారులకు కరెంట్ కష్టాలు తప్పలేదు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో నగదు లావాదేవీలు, పంట, గోల్డ్‌లోన్, తదితర లావాదేవీల నిమిత్తం ఖాతాదారులు వివిధ గ్రామాల నుంచి బ్యాంకుకు వచ్చారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. బ్యాంకులో జనరేటర్ ఉన్నా అది కొంతసేపు పనిచేసి మొరాయించింది. దీంతో బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. ఇళ్లకు వెళ్లి మరలా వద్దామనుకుంటే ఆయా గ్రామాలు దూరం కావడం, మరుసటిరోజు ఆదివారం కావడంతో అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది. ఒకవైపు కరెంటు లేకపోవడం మరోవైపు ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఖాతాదారులు బ్యాంకులో వేచి ఉండలేక ఆరుబయట సేద తీరారు. దాదాపు రెండు గంటలపాటు ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది విద్యుత్ సరఫరా లేక అవస్థలు పడ్డారు. మధ్నాహం 1 గంటకు తిరిగి కరెంట్ రావడంతో బ్యాంకు సేవలు యథావిధిగా కొనసాగాయి.

శక్తి యాప్‌తో పోలీసు రక్షణ



యాప్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

డోన్ టౌన్: మొబైల్‌లో శక్తి యాప్ ఉంచుకోవడం ద్వారా అత్యవస పరిస్థితుల్లో పోలీసు రక్షణ, సహాయం పొందవచ్చని డోన్ శక్తి టీం సభ్యులు సూచించారు. శనివారం పట్టణంలోని మాకం వీధిలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఉమెన్, చైల్డ్ సేఫ్టీపై మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైం 1930, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, బాల్య వివాహాలు, పోలీస్ ఎమర్జెన్సీ 100,112,181 గురించి వివరిస్తూ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

కబడ్డీ విజేత బేతంచెర్ల జట్టు



విజేతలకు బహుమతి అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ఆయా జట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోరులో బేతంచెర్ల దమ్ము టీం విజేతగా నిలిచింది. ఓర్వకల్లు మండలం కొంతలపాడు ద్వితీయ, బేతంచెర్ల హెచ్ఎంటీం తృతీయ, రంగాపురం నాల్గొవ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్, దాతలు బుగ్గన ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్ స్వరూప్, సునీల్, మద్దిలేటి చేతుల మీదుగా వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.8 వేలు, రూ.6 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

మార్కులే జీవితం కాదు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న లక్ష్మీదేవి

అవుకు: జీవితంలో పరీక్షలు.. మార్కులే ముఖ్యం కాదని నంద్యాల జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ లక్ష్మీదేవి అన్నారు. శనివారం అవుకు కస్తూర్బా పాఠశాలలో పరీక్షలు, మార్కులే జీవితమా అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలు, మార్కులకు ప్రాధాన్యత ఇవ్వకుండా క్రమశిక్షణ, పట్టుదల, జ్ఞాన సంపద, సమయపాలన వంటి లక్షణాలు జీవిత విజయానికి కీలకమని ఆమె తెలిపారు. త్వరలో పదో తరగతి పరీక్షల ఫలితాలు రానున్నాయని.. ఎలాంటి ఫలితాలు వచ్చినా మానసికంగా ధృడంగా ఉండాలని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ ఇంతియాజ్‌బాషా

డోన్ టౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు, మహిళలు, బాలికలపై లైంగిక దాడులు, సైబర్ నేరాలు, బెట్టింగ్ యాప్స్ గురించి అవగాహన కల్పించారు. ఎస్ఐలు శరతకుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్, సిబ్బంది ఉన్నారు.

శభాష్ గోపి



124వ సారి రక్తదానం చేస్తున్న కోలా గోపి

డోన్: పట్టణానికి చెందిన కోలా గోపి 124వ సారి రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నారు. శనివారం ఏ పాజిటివ్ రక్తాన్ని కర్నూలు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. ప్రైవేటు కళాశాలలో పీఈటీగా పనిచేస్తున్న గోపి రక్తదాన శిబిరాల్లో ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ద్రోణాచలం సేవా సమితి రక్తమిత్ర బృందంలో క్రియాశీలక సభ్యునిగా ఉన్న ఆయన్ను పలువురు అభినందించారు.